
వడదెబ్బ బాధితుల కోసం ప్రత్యేక వార్డు

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రమవుతున్న తరుణం లో వడదెబ్బ ప్రభావానికి గురయ్యే బాధితుల కోసం ముందస్తుగా ప్రత్యేక వా ర్డును కేసీ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. నాలుగైదు రోజులుగా నగరం లో ఎండవేడిమి అధికంగా ఉందని, తప్పనిసరి అయితే తప్ప సాధ్యమైన మేర కు మధ్యాహ్నం వేళ సంచారం తగ్గించుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. హీట్ స్ట్రోక్ వార్డ్ పేరిట ఏర్పాటు చేసిన వార్డులో ఎయిర్ కూలర్, ఫ్యాన్, ఇతర ఔషధాలు సిద్ధం చేశారు. హీట్ స్ట్రోక్ కారణంగా జ్వరం, తలనొప్పి, తల తిర గడం, తదితర సమస్యలు తలెత్తుతాయని వైద్యులు తెలిపారు.



జీఎస్టీ వాటాలపై మాటల యుద్ధం

- కేంద్రం తీరుపై సీఎం, మంత్రుల మండిపాటు
- పన్నుల వాటాలో కోత - రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ
- అన్యాయం జరగలేదు - నిర్మలా సీతారామన్





బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కేంద్రంతో యుద్ధం సాగుతోంది. ఏదో ఒక అంశంపై కేంద్రప్రభుత్వ తీరును ఖండిస్తూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య విమర్శలు చేస్తున్నారు. నిన్నమొన్నటిదాకా కరువు సాయం కోసం తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అంతటితో ఆగకుండా ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఢిల్లీలో 'మా పన్నులు మా హక్కు' అంటూ ఆందోళన చేశారు. ఇదే విషయమై కోర్టును కూడా ఆశ్రయించారు. కేంద్రప్రభుత్వం కర్ణాటక పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని విమర్శిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల వేడి రాజుకున్న తరుణంలో జీఎస్టీ వాటాల కోసం అటు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ దీటుగా స్పందించారు. నిర్మలా సీతారామన్ రాష్ట్ర పర్యటనలో తప్పుడు సమాచారం ఇస్తున్నారని బహిరంగ చర్చకు రావాలని సీఎం సిద్దరామయ్య డిమాండ్ చేశారు. మరోవైపు బీజేపీ నుంచి ప్రతిపక్షనేత ఆర్.అశోక్, బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల తీరును తప్పుబడుతున్నారు. 'మా పన్నులు మా హక్కు' అనే నినాదం సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకమని తేజస్వి సూర్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మా పన్నులు మాకే ఇవ్వాలంటే పొరుగు రాష్ట్రాలు భారతదేశంలో లేవా అంటూ ప్రశ్నించారు. బెంగళూరు నగరంలో అత్యధిక పన్నులు వసూలయ్యేది మహదేవపుర నియోజకవర్గమని, అక్కడి ప్రజలు మా పన్నులు మా ప్రగతికే ఖర్చు పెట్టాలని డిమాండ్ చేస్తే అత్యంత తక్కువ వసూలయ్యే శివాజీనగర్ ప్రాంతాన్ని విస్మరించాలనేది సందేశమా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువు నెలకొంది. 234 తాలూకాలపైకి ఏకంగా 223 తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. మూడు నెలల క్రితమే కేంద్రం నుంచి కరువు అధ్యయన బృందాలు రాష్ట్రంలో పర్యటించాయి. కానీ పరిహారం అందలేదు. ఇదే విషయమై సీఎం సిద్దరామయ్య తరచూ కేంద్రం తీరును ఎండగడుతుంటారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలోనూ ఇదే అస్త్రంగా కాంగ్రెస్ పార్టీ వాడుతోంది. కేంద్రంపై నిత్యం రాష్ట్రం నుంచి సీఎం, డీసీఎంతోపాటు మంత్రులు విమర్శలు చేస్తున్న తరుణంలో బీజేపీ అధిష్ఠానం వ్యూహాత్మకంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను రంగంలోకి దించింది. నాలుగైదు రోజుల వ్యవధిలోనే రెండుసార్లు బెంగళూరుకు వచ్చిన నిర్మలా సీతారామన్ గ్రాంట్లు, కరువు సాయం వంటి అంశాలపై పలు గణాంకాలతో వివరణలు ఇవ్వడం వివాదమైంది.

పన్నుల వాటాలో అన్యాయం అంటే సహించేది లేదు : నిర్మలా సీతారామన్

బెంగళూరు నగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, నగరం అభివృద్ధి చెందాలని ఇక్కడి ప్రజలు మా పన్నులు మాకే ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తే ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పన్నులు ఒక ప్రాంత అభివృద్ధికి మాత్రమే కాదని దేశంలోని అందరూ సమాన అభివృద్ధికోసమన్నారు. రాష్ట్రానికి సంబంధించి పన్నుల వాటాను మార్చి వరకు సంపూర్ణంగా విడుదల చేశామని వివరించారు. 15వ ఆర్థిక కమిషన్ మధ్యంతర నివేదికలో రూ.5,495 కోట్లు ఇవ్వాలని సిఫారసు చేయడం వాస్తవమన్నారు. కమిషన్ తుది నివేదికలో ఆ సిఫారసులు లేవని, రాష్ట్రాలకు పెట్టుబడుల ఖర్చుకు గ్రాంట్లు ఇచ్చే ప్రస్తావన లేకున్నా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్ణాటకకు రూ.8,035 కోట్లు వడ్డీ రహిత రుణాన్ని ఇచ్చారని తెలిపారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ నాయకులు ఎందుకు ప్రస్తావించరని పేర్కొన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ నిధులలో భాగంగా రూ.697 కోట్లు కేంద్రం వాటా చెల్లించామని, పదేళ్ల యూపీఏ పాలనతో పోలిస్తే నాలుగురెట్లు అధికంగా గ్రాంట్లు విడుదల చేశామని తెలిపారు.

రాష్ట్రానికి తీరని అన్యాయం - రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ



జీఎస్టీ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి 2019-20లో రాష్ట్రానికి పన్నుల వాటాలో రూ.18,897 కోట్లు కోత ఏర్పడిందని, 2023-24లో రూ.34,750 కోట్ల నష్టం జరిగిందన్నారు. రాష్ట్ర ఆదాయంలో ఏటా 30-32 వేల కోట్ల రూపాయల కోత ఏర్పడుతోందన్నారు. ఇదే కారణంతోనే జీఎస్టీ వాటాను కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు కేటాయించాలని ఆర్థిక కమిషన్ స్పష్టంగా మార్గదర్శకాలు చేసిందన్నారు. అయితే కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యతిరేకిస్తున్నారన్నారని తెలిపారు. గతంలో కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రానికి 4.731 శాతం వాటా ఉండేదని, 15వ ఆర్థిక కమిషన్ ఈ ప్రమాణాన్ని 3.617కు తగ్గించిందన్నారు. తద్వారా రాష్ట్రానికి 23 శాతం గ్రాంట్లు తక్కువయ్యాయని వివరించారు. ఏటా 6 నుంచి 13వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందన్నారు. రాష్ట్రానికి ఇప్పటి వరకు రూ.62,098 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. దేశంలోని 31 రాష్ట్రాలను పరిశీలిస్తే కర్ణాటకకు మాత్రమే తక్కువ ప్రమాణంలో పన్నుల వాటా జరుగుతోందన్నారు.

మే 29 నుంచే పాఠశాలలు

- వచ్చే ఏడాది బోర్డు పరీక్షలు
- వేసవి సెలవుల్లో మధ్యాహ్న భోజనం



బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలు మే 29 నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే ఏడాది బోర్డు పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయని విద్యాశాఖ ప్రకటించింది. విద్యాసంవత్సరంలో 244 రోజులు బడిదినాలు కాగా 180 రోజులు నైపుణ్యత, బోధన ప్రక్రియలకు కొనసాగనున్నాయి. దసరా సెలవులు అక్టోబరు 3 నుంచి 20వ తేదీ వరకు ఉంటాయి. మొత్తంగా వచ్చే విద్యాసంవత్సరం 121 రోజులు సెలవులు ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ ఏకరూప విధానం అమలు చేసేలా మార్గదర్శకాలను విడుదల చేశారు. నెలల వారీగా పాఠ్యాంశాలను, బోధనేతర అంశాలపై షెడ్యూల్ విధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు రెండు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తారు. ఏప్రిల్ 10వ తేదీ నుంచే హెడ్మాస్టర్లకు పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

ముగిసిన ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు

ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు శనివారంతో ముగిశాయి. మార్చి 25 నుంచి ఏప్రిల్ 6వరకు పరీక్షలు నిర్వహించారు. 8.41లక్షల మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా 8.26 లక్షల మంది హాజరయ్యారు. 15,402 మంది గైర్హాజరయ్యారు. కాగా మౌల్యమాపన ప్రక్రియ ప్రారంభమైంది.

వేసవి సెలవుల్లో మధ్యాహ్న భోజనం

రాష్ట్రంలో తీవ్రమైన కరువు నెలకొనడంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వేసవి సెలవుల్లోనూ కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 223 కరువు తాలూకాల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తారు. 1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులందరికీ భోజనం సమకూర్చనున్నారు. ఏప్రిల్ 11 నుంచి మే 28 వరకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి రోజూ 12.30 గంటల నుంచి 2 గంటల వరకు భోజనం సమకూరుస్తారు. ఎండవేడిమి ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల మధ్య భోజనాన్ని సిద్ధం చేయనున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా భోజనాన్ని సిద్ధం చేసి పంపిణీ చేయాలని, ఆహారం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ సూచించింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అంగీకారపత్రాన్ని పొందాల్సి ఉంటుందని సూచించారు. 250మందికి పైగా విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయదలిచి వస్తే అదనంగా మరో ఉపాధ్యాయుడు అందుబాటులో ఉండాలని సూచించింది.

మాధుస్వామితో ముద్ద హనుమేగౌడ భేటీ

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తుమకూరు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ముద్ద హనుమేగౌడ బీజేపీకి చెందిన మాజీ మంత్రి జేసీ మాధుస్వామిని ఆదివారం భేటీ కావడం చర్చనీయాంశమైంది. చిక్కనాయకనహళ్లి తాలూకాలోని జేసీ పుర గ్రామంలోని మాధుస్వామి ఇంటికి ముద్దహనుమేగౌడ వెళ్లగా ఆయన ఆత్మీయంగా స్వాగతించారు. తుమకూరు లోక్‌సభ టిక్కెట్ కోసం మాధుస్వామి ప్రయత్నించారు. అనూహ్యంగా సోమణ్ణకు టిక్కెట్ వరించింది. అప్పటి నుంచి మాధుస్వామి పార్టీ పట్ల వ్యతిరేకంగా ఉన్నారు. బీజేపీ నేత యడియూరప్ప స్వయంగా వెళ్లి పార్టీకి దూరం కారాదని సూచిస్తూనే అసంతృప్తిని తగ్గించారు. సోమణ్ణతో కలసి పనిచేసే విషయంలో రాజీ ఉండదని మాధుస్వామి బహిరంగంగా ప్రకటించడంతో యడియూరప్ప ఏం చేయలేకపోయారు. తాజాగా కాంగ్రెస్ అభ్యర్థిని కలవడం సర్వత్రా కుతూహలం కలిగించింది. మాధుస్వామి, కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తే సోమణ్ణకు విజయావకాశాలు తగ్గే ప్రమాదం ఉంది.



ముద్దహనుమేగౌడను స్వాగతిస్తున్న మాధుస్వామి

ఎండవేడిమికి ఏనుగు బలి

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎండవేడిమికి ఏనుగు మృతి చెందింది. రామనగర జిల్లా కనకపుర అటవీ ప్రాంతం బెట్టహళ్లి బీట్ పరిధిలో 14ఏళ్ల ఏనుగు మృత్యువాత పడింది. ఆదివారం విగతజీవిగా పడి ఉన్న ఏనుగును గుర్తించిన అటవీశాఖ సిబ్బంది వెంటనే పశు వైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. ఎండవేడిమి తట్టుకోలేకనే మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. పోస్టుమార్టం జరిపించారు. కాగా రెండు రోజులక్రితం కనకపుర, తమిళనాడు సరిహద్దు ప్రాంతం యశవనత్త ప్రాంతంలోనూ 35 ఏళ్ల ఏనుగు మృతి చెందింది. అది ఏ కారణంతో మృతి చెందిందనే విషయం తెలియరాలేదు. పోస్టుమార్టం జరిపించారు.



ఇఫ్తార్	: సోమవారం సాయంత్రం 6:33
సెహరి	: మంగళవారం ఉదయం 04:56



ర్యాలీలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య తదితరులు

మోదీ అబద్ధాల కోరు : సీఎం

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ అబద్ధాలకోరు అని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కూడా అబద్ధాలు చెబుతున్నారని ఇటువంటి అబద్ధాలు చెప్పేవారి పార్టీకి ఓటు వేస్తే మీకు గౌరవం దక్కుతుందా..? అని ప్రజలను ఉద్దేశించి ప్రశ్నించారు. బెంగళూరు ఉత్తర లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మహాలక్ష్మీ లే అవుట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రొఫెసర్ రాజీవ్‌గౌడ తరఫున ప్రచారం చేస్తూ ఆయన పైవిధంగా మాట్లాడారు. సమర్థత కల్గిన వ్యక్తికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. భారీసంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

- మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసేది లేదని మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ భావోద్వేగంతో పేర్కొన్నారు. క్రియాశీలక రాజకీయాలకు దూరం కావాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. రమేశ్‌కుమార్ వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనం కలిగించాయి. ఆదివారం కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకా అడ్డగల్ గ్రామంలో కోలారు లోక్‌సభ అభ్యర్థి గౌతమ్ తరపున ఎన్నికల ప్రచారసభలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ కలుషితమైందని, నైతిక విలువలు పతనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లపాటు రాజకీయ జీవనంలో న్యాయబద్ధంగా వ్యవహరించానని అన్నారు. నగదు తీసుకుని రాజకీయాలు చేయలేదన్నారు. కానీ పార్టీకి చెందిన కొందరు నగదు తీసుకుని అమ్ముడుపోయి మోసంతో తనను ఓడించారని అన్నారు. తల్లిలాంటి పార్టీకి ద్రోహం చేశారని, అధికార కాంక్షకోసం అనైతిక రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వారు సర్వనాశనం అవుతారని, తనను మోసం చేసిన వారి పరిస్థితి ఏమవుతుందో చూడాలని, కొంత సమయం పాటు భావోద్వేగంతో మౌనంగా ఉన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు అడిగేందుకు ముందుకు రానని, తన కుమారుడు హర్ష కూడా పాల్గొనరని చెప్పారు. లోక్‌సభ అభ్యర్థి గౌతమ్‌కు ఓట్లు వేయాలని అడగడం లేదని, అయితే తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. సభలో అనిల్‌కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి మునియప్ప కోలారులో ప్రచారానికి వెళ్లలేదు. ఇదే విషయమై దొడ్డబళ్లాపురలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌లో పాల్గొన్నానని తెలిపారు. శనివారం సీఎం, డీసీఎం పాల్గొన్న సభకు ఎవరూ ఆహ్వానించలేదన్నారు. మాట మాత్రంగా పిలవకుంటే ఎలా వెళ్లానని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్

లోక్‌సభలో ఒక్క ప్రశ్న వేయని సదానందగౌడ

- 382 ప్రశ్నలు వేసిన తేజస్వీ సూర్య

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో సమస్యలను లేవనెత్తాల్సిన ఎంపీలు కనీసం ఐదేళ్లలో ఒక్క ప్రశ్న కూడా వేయకపోవడం సిగ్గుచేటు అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బెంగళూరు నగరానికి సంబంధించిన ముగ్గురు ఎంపీల పనితీరుపై బెంగళూరు పొలిటికల్ యాక్షన్ కమిటీ నివేదిక ఆదివారం విడుదల చేసింది. బెంగళూరు ఉత్తర ఎంపీ సదానందగౌడ ఐదేళ్ల వ్యవధిలో ఒక్క ప్రశ్న కూడా వేయలేదు. సదానందగౌడ లోక్‌సభ సమావేశాల్లో 63 శాతం హాజరయ్యారు. 2019 మే 30 నుంచి 2021 జూలై 2వరకు కేంద్రమంత్రిగా వ్యవహరించారు. కేంద్రమంత్రిగా ఆయన ప్రశ్నించే అవకాశం ఉండదు. ఆ తర్వాత ప్రశ్నించేందుకు అవకాశం ఉన్నా సద్వినియోగం చేసుకోలేకపోయారు. బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్విసూర్య అత్యధిక ప్రశ్నలు సంధించారు. ఐదేళ్లలో అత్యధికంగా 382 ప్రశ్నలు వేశారు. బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ 189 ప్రశ్నలు అడిగారు. తేజస్వి సూర్య 212 రోజులు, పీసీ మోహన్ 224 రోజులు లోక్‌సభలో భాగస్వామ్యులయ్యారు. సరాసరిన 79 శాతం లోక్‌సభ సభ్యుల హాజరు ఉండగా కర్ణాటకకు చెందిన ఎంపీలు 71శాతం పాల్గొన్నట్టు నివేదిక వెల్లడించింది.



తేజస్వి సూర్య



సదానందగౌడ




రథోత్సవంలో భక్తుల సందడి

ఘనంగా వీరాంజనేయస్వామి రథోత్సవం

చింతామణి, ఏప్రిల్ 7: చింతామణి తాలూకాలోని అంబాజిదుర్గ హోబళి కంగానహళ్లి గ్రామంలో పురాతనమైన ప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయ బ్రహ్మరథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకం, అలంకరణ నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. డప్పు, నాదస్వర, జానపద కళాబృందాలు రథోత్సవంలో పాల్గొన్నాయి. గ్రామస్థులు పానకం, మజ్జిగ, పెసరపప్పు పంపిణీ చేయడంతోపాటు అన్నదాసోహం నిర్వహించారు. గ్రామపంచాయతీ అధ్యక్షురాలు మమతా మంజునాథరెడ్డి, దేవాలయ ట్రస్టు సభ్యులు, గ్రామ ప్రముఖులు నారాయణప్ప, గ్యాస్ నరసింహ తదితరులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



జానపద కళాబృందాలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,579.44	1,580.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	932	5,417
సామర్థ్యం (టీఎంసీలు)	4.20	4.52

ఓటువేయడం ప్రతిపౌరుడి బాధ్యత : డీసీ



సైకిల్ జాతాను ప్రారంభిస్తున్న డీసీ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 7: జిల్లాలోని ఓటర్లందరూ మే 7న తప్పకుండా ఓటు వేయాలని, ఓటు వేయడం బాధ్యతగల పౌరుల ప్రథమ కర్తవ్యమని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా పిలుపు నిచ్చారు. లోక్‌సభ ఓటింగ్ అవగాహనలో భాగంగా నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ కళా శాల మైదానం ఆవరణ నుంచి జిల్లా యంత్రాంగం, జిల్లా స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ జాతాను ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఓటర్లందరూ ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని ఓటు వేసినప్పుడే ప్రజా ప్రభుత్వంలో మన హక్కులను ప్రశ్నించే అర్హత ఉంటుందన్నారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు లేనివారు ఏప్రిల్ 9లోపు తమపేరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాపంచాయతీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి జిల్లా స్వీప్ కమిటీ చైర్మన్ రాహుల్ శరణప్ప మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిర్మించేందుకు అర్హులైన ఓటర్లు తప్పకుండా ఓటు వేయాలన్నారు. జిల్లాపోలీసు కమిషనర్ రంజిత్ కుమార్ బండారు మాట్లాడుతూ ప్రజాపాలనలో పౌరులు ఓటు వేయడం ముఖ్యమన్నారు. అనంతరం ఓటర్లతో ప్రమాణం చేయించారు. ఈసందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా అసిస్టెంట్ కమిషనర్ హేమంత్, మహానగర కార్పొరేషన్ కమిషనర్ ఖలీల్ సాబ్, బళ్లారి తహసీల్దార్ గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు బోల్తా-ముగ్గురి దుర్మరణం



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 7: ఓ ప్రైవేట్ బస్సు బోల్తాపడి ముగ్గురు దుర్మరణం చెందిన సంఘటన చిత్రదుర్గ జిల్లా పరిధిలోని హొళల్కెర వద్ద ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ప్రమాదం జరగడంతో బస్సులో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. బెంగళూరు నుండి గోకర్ణకు వెళుతున్న ఓ ప్రైవేట్ ఏసీ స్లీపర్ కోచ్‌లో 35 మంది ప్రయాణిస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున జాతీయ రహదారి-13లో వేగంగా ప్రయాణిస్తున్న బస్సు హొళల్కెర పట్టణం శివారు ప్రాంతంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు దుర్మరణం చెందగా 10మందికి పైగా గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయచర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన వారిని హొళల్కెర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పీఎస్‌ఐ సురేష్ తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వివరాలు తెలియాల్సి ఉంది.

పట్టణంలోకి వచ్చిన ఎలుగుబంటి

కంప్లి, ఏప్రిల్ 7 : హూవిన అడగలి తాలుకా ఇస్లాంపేట పట్టణం ఐదవవార్డులో శనివారం రాత్రి ఎలుగు బంటి ప్రత్యక్షమైంది. ఆ సమయంలో అక్కడున్న కుక్కలు కరవడంతో ప్రజలు అప్రమత్తమై కేకలు వేయడంతో ఎలుగుబంటి రోడ్డులో పరుగులు తీసింది. ఇళ్ల వద్ద, ఆరు బయట వున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఒంటిపూట బడులు ప్రారంభం

కంప్లి, ఏప్రిల్ 7 : అంగన్‌వాడీ కేంద్రాలలో ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. రోజురోజుకు భానుడి ప్రభావం ఎక్కువకావడంతో అధికారులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాల సమయాన్ని మార్చారు. ఏప్రిల్, మే రెండు నెలలు మాత్రం ఒంటిపూట బడులు వుంటాయన్నారు.

4 రోజులుగా క్యూలైన్‌లో..

మిరప రైతుల అగచాట్లు..

- అమ్ముదామంటే రేటు లేదు
- నిలువ చేద్దామంటే స్థలం లేదు





ఈ ఏడాది మిరప పంట బాగా పండింది. అమ్ముకుందామనుకుంటే రేటు లేదు.. పోనీ నిల్వ చేసి రేటు వచ్చాక అమ్ముకుందామనుకుంటే గోదాములు ఖాళీ లేవు. ఒక ట్రాక్టర్‌లోనో, లారీలోనో మిరప కాయలను తీసుకుని గోదాముల్లో నిల్వచేసేందుకు బళ్లారికి వస్తే అక్కడ స్థలం లేక క్యూలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగు రోజులు గడిచిపోతున్నా గోదాముల్లో సరుకు నిల్వ చేసుకునేందుకు వీలులేక పోవడంతో రైతులు రోడ్డు పైనే లారీల వద్ద రేయింబవళ్లు కాపలా ఉంటున్నారు. కొందరు రైతులు అక్కడే లారీల వాళ్లతో కలిసి వంట వండుకుని పూట గడుపుకుంటుంటే, మరి కొందరు రైతులు లారీల కిందనే పడుకుంటూ దీనంగా కాలం వెళ్లదీస్తున్నారు.

బళ్లారి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం కింద ఈ సంవత్సరం ఎక్కువగా మిరప పంటను సాగు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, అనంతపురం, జిల్లాల్లో కూడా రైతులు విపరీతంగా మిరప సాగు చేశారు. గతేడాది మిరప క్వింటాల్ ఏకంగా రూ. 65 నుండి 70 వేల వరకూ పలకడమే ఇందుకు కారణం. తీరా పంట చేతికి వచ్చే సమయానికి రేటు తగ్గుముఖం పట్టింది. ధర ప్రారంభంలో రూ. 40 వేలు ఉండగా, ఇప్పుడు క్వింటాల్ మిరప రూ. 8 వేల నుండి 15 వేలు వరకూ మాత్రమే పలుకుతోందని రైతులు చెబుతున్నారు.

మిరపతోట ఎకరానికి రూ.1.5 లక్షల నుంచి 2 లక్షల వరకూ పెట్టుబడి పెట్టామని 10 నుంచి 14 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చిందని రైతులు అంటున్నారు. సాగుకు ముందు ఉండే రేటు ప్రకారం లెక్క వేస్తే ఎకరానికి రూ. 2 లక్షల వరకూ మిగులుతుందని అంచనా వేశామన్నారు. కానీ ఈఏడాది రేటు పడిపోవడంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు.

ప్రస్తుతం క్వింటాల్ మిరప రూ.8 వేల నుంచి 15 వేలకు ధర పలుకుతోంది. దీని ప్రకారం లెక్కవేస్తే రూ.80 వేల నుంచి 1.5 లక్షల వరకు వచ్చే అవకాశం ఉంది. దీన్ని బట్టి ఎకరంలో రూ. లక్షనుండి రూ. 1.5 లక్షలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని ఉరవకొండ, గుంతకల్లు, రాయదుర్గం, కల్యాణదుర్గం, కంబదూరు, అలాగే కర్నూలు జిల్లాలోని చిప్పగిరి, ఆలూరు, తదితర ఏరియాల నుండి మిరప రైతులు మిరపకాయలను నిలువ చేసుకునేందుకు బళ్లారికి తీసుకు వస్తున్నారు. ఇక కర్ణాటకలోని బళ్లారి, బ్యాడిగి, చెల్లికెర, చిత్రదుర్గం రైతులు కూడా గోదాముల్లో నిలువ చేయడానికి సరుకును ఇక్కడకు తీసుకొస్తున్నారు. బళ్లారిలో సుమారు 21 కోల్డ్ స్టోరేజీలు ఉండగా, ఇక బ్యాడిగిలో కూడా సుమారు 100 పై గా కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. కాని అన్ని చోట్ల స్టాక్ ఫుల్ కావడంతో రైతులు సరుకు నిల్వ చేసుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని తెలుస్తోంది.

నాలుగు రోజులు గడిచిపోతున్నా గోదాముల్లో సరుకు నిల్వ చేసుకునేందుకు వీలులేక పోవడంతో అటు ఇంటికీ పోలేక ఇటు గోదాముల్లో నిలువ చేసుకోలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మిరపకు మద్దతుధర ప్రకటించి తమ వద్ద ఉండే పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

బీజేపీ వారిని నమ్మి మోసపోవద్దు



కమ్మభవనంలో కాంగ్రెస్ సమావేశాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బి. నాగేంద్ర

బళ్లారి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఈ లోక్‌సభ ఎన్నికలు దేశానికి చాలా కీలకమని, ప్రధానిగా రాహుల్ గాంధీ రావాలని, ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం గెలవాలని, రాష్ట్ర యువజన క్రీడా శాఖ. బళ్లారి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బి. నాగేంద్ర పేర్కొన్నారు. ఆదివారం బళ్లారిలోని కమ్మభవనంలో డి.సీ.సీ నూతన అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ నేతృత్వంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి నాగేంద్ర, బళ్లారి ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, సండూరు ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తుకారాం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లం వీరభద్రప్ప, ముండ్రిగి నాగరాజు పాల్గొని ప్రసంగించారు. మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీరాములును ఓడించాలని కోరారు.

ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ నాయకులు చార్‌సౌ(400) ఎంపీ సీట్లు గెలుస్తామంటారని, ఇంకా ముందుకెళ్లి హజార్(1000) సీట్ గెలుస్తామంటారని, అసలు వాళ్ల గెలిచేసీట్లు ఎన్నా వాళ్లకే తెలియదని ఎద్దేవా చేశారు. సండూరు ఎమ్మెల్యే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తుకారాం మాట్లాడుతూ బీజేపీ హిందుత్వ విధానంతో రాజకీయం చేస్తుందన్నారు. భారతదేశానికి ఒకప్పుడు బ్రిటీష్ వాళ్ల నుండి స్వతంత్రం తెచ్చేందుకు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు బీజేపీ నుండి స్వతంత్రం తెచ్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సుబ్బరాయుడు, కార్పొరేటర్లు నందీష్‌బాబు, ప్రభంజన్, గుమ్మనూరు జగన్, మించు శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ బి- బ్లాక్ అధ్యక్షుడు అభిషేక్, మానయ్య, వెంకటేశ్ హెడ్డే, అన్నా నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, మేనేజర్ కురుబ నాగరాజు, వివిధ వార్డుల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రసవత్తరంగా కొప్పళ ఎన్నికల ప్రచారం

- తలనొప్పిగా మారిన మాజీ ఎంపీ సంగణ్ణ
- గంగావతిలో అసమ్మతి పవనాలతో తలపట్టుకున్న కాంగ్రెస్



కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాళ్



బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజు క్యాటవర్

బళ్ళారి గాంధీనగర్, ఏప్రిల్ 7: వేడివాడిగా జరుగుతున్న ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, జేడియస్ పార్టీలు ఆచితూచి అడుగులు వేసి అభ్యర్థులను ఎంపిక చేశాయి. రాష్ట్రంలో బీజేపీతో జేడియస్ చేతులు కలపడంతో ఇరు పార్టీలు సంయుక్తంగా కొత్త అభ్యర్థిని నిలబెట్టాయి. 2014, 2019లలో రెండు సార్లు వరుసగా గెలుపొందిన కరడి సంగణ్ణకు ఈ సారి బీజేపీ పార్టీ టికెట్టు తప్పించి కొత్త వ్యక్తికి ఇవ్వడంతో సంగణ్ణ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండి తటస్థం అయ్యారు. బీజేపీ కొత్తవారికి టికెట్టు ఇచ్చే సాహసానికి ఒడిగట్టిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రస్తుతం కొప్పళ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్ డాక్టర్ బసవరాజుకు కట్టబెట్టింది. మూడు దశాబ్దాలుగా రాజకీయ పట్టుకలిగిన కాంగ్రెస్‌కు చెందిన హిట్నాళ్ కుటుంబాన్ని ఎదురొడ్డి నిలబడే సత్తా డాక్టర్ బసవరాజు క్యాటవర్‌కు ఉందని ఆయనను ఎంపిక చేయడం విశేషం. అయితే కాంగ్రెస్ పార్టీ రాజశేఖర్ హిట్నాల్‌ను ప్రస్తుతం లోక్‌సభ అభ్యర్థిగా రంగంలో దింపడం విశేషం. కురుబ సముదాయానికి చెందిన రాజశేఖర్ హిట్నాల్ ఆయన తండ్రి బసవరాజు హిట్నాల్ 2004లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచారు. అనంతరం 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేశారు. కొప్పళ శాసనసభ ఎన్నికల్లో రాఘవేంద్ర హిట్నాళ్ హ్యాట్రిక్ సాధించడాన్ని దృష్టిలో పెట్టుకున్న కాంగ్రెస్ నాయకులు ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిగా ఆయన సోదరుడు రాజశేఖర్ హిట్నాల్‌ను ఎంపిక చేసిందని చెప్పవచ్చు. అయితే కరడికుటుంబం కూడా రాజకీయ రంగా అనుభవమున్న కుటుంబమే. ఈ కుటుంబం నుండి సంగణ్ణ కరిడి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం భాజపా నుండి రెండు సార్లు ఎంపిగా ఎన్నికయ్యారు. అయితే ఈ సారి భాజపా కరిడి సంగణ్ణకు కాకుండా డాక్టర్ బసవరాజుకు టికెట్ ఇవ్వడం చర్చనీయాంశగా మారిందని చెప్పవచ్చు. పంచమశాలి సముదాయానికి చెందిన బసవరాజు కుటుంబం రాజకీయాలకు కొత్తదేమి కాదు. బసవరాజు తండ్రి కె.శరణప్ప కుష్టగి నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన సోదరుడికి జిల్లా పంచాయతీ సభ్యులుగా పనిచేసిన అనుభవం ఉంది. అయితే ఈ ఎన్నికల్లో లోక్‌సభ ఎన్నికల్లో బసవరాజు డైరెక్ట్‌గా పోటీ చేస్తుండడం విశేషం. భాజాపా టికెట్ కోల్పోయిన కరిడి సంగణ్ణ తటస్థ స్థితి, గంగావతిలో కాంగ్రెస్ వ్యతిరేక పవనాలు ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు ఇబ్బందికరంగా మారాయి.

అభివృద్ధి చేసే నాయకుడికే ఓటేయండి: అన్నపూర్ణతుకారాం



కోడిహళ్లిలో తుకారామ్ గెలుపు కోసం ప్రచారం చేస్తున్న అన్నపూర్ణ

కంప్లి, ఏప్రిల్ 7 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గ్రామాల్లో అభివృద్ధి చేపట్టే నాయకుడినే ఎన్నుకోవాలంటూ శ్రీమతి అన్నపూర్ణ తుకారామ్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపు కోసం భార్య అన్నపూర్ణ ఆదివారం విజయ నగర జిల్లాలో పలుగ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకిచ్చిన మాట ఎప్పుడూ నిలబెట్టుకుంటామన్నారు. కాబట్టే సండూరు నియోజకవర్గంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రజలు తన భర్తను గెలిపించారన్నారు. ఈ సారి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని ఈ ఎన్నికల్లో కూడా తన భర్తకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించినట్లయితే అందుబాటులో నాయకుడిని ఎన్నుకున్న వారవుతారని తెలిపారు. ఉభయజిల్లాల్లో పూర్తిగా అభివృద్ధి బాటలో కొనసాగుతాయన్నారు. హూవిన అడగళి తాలుకాలో ఆదివారం పలు గ్రామాలలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో శివయోగి, కొట్రేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హనుమంతప్ప, వాసు, అంజినమ్మ, ఉదయ్‌కుమార్, హేమలత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మత గురువుల ఆదర్శతత్వాలను పాటించాలి



సౌదాగర్ మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సిరుగుప్ప, ఏప్రిల్ 7 : ముస్లిం మత గురువుల ఆదర్శతత్వ సిద్ధాంతాలను పాటించాలని సౌదాగర్ మసీదు గురువులు అబ్దుల్ సమాద్ నిజామీ తెలిపారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నేటికి 27 రోజులు అయిన నేపథ్యంలో ముస్లింలు శుభ రాత్రి కార్యక్రమాన్ని చేపట్టారు. మసీదులో పూజలు జరిపి, ప్రార్థనలు జరిపి అల్లాను ప్రార్థించారు. ఈ సందర్భంగా ముస్లిం ప్రముఖులు డాక్టర్ మహమ్మద్ వలీ, అబ్దుల్ నబీ, మహమ్మద్ ఇబ్రహీమ్, అండీ హుస్సేన్ బాషా, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అల్లం ప్రశాంత్



కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అల్లం ప్రశాంత్

బళ్లారిరూరల్, ఏప్రిల్ 7: బళ్లారి నగరంలో ఆదివారం కమ్మభవన్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా అల్లం ప్రశాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి నాగేంద్ర, సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రేపు శ్రీ తాయమ్మదేవి మహా రథోత్సవం

సిరుగుప్ప, ఏప్రిల్ 7 : శ్రీ తాయమ్మదేవి 41వ మహారథోత్సవం మంగళవారం సాయంత్రం జరుపనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవి మహారథోత్సవం సందర్భంగా 8వ తేదీ రాత్రి అభయాంజనేయస్వామి భజనమండలి ఆధ్వర్యంలో అఖండ భజన కార్యక్రమం, 9వ తేదీ తుంగభద్ర నది నుంచి కుంభ మహోత్సవం, సాయంత్రం విజయనగర కాలనీ యువతీయువకుల ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన, సాయంత్రం 6 గంటలకు తాయమ్మదేవి మహారథోత్సవం జరుగుతున్నట్లు తెలిపారు. 10వ తేదీ రాత్రి తాయమ్మదేవి కళా సంఘం ఆధ్వర్యంలో నరనాగర సాంఘీక నాటక ప్రదర్శన జరుగుతున్నట్లు తెలిపారు.

పోలీసు జాగిలాలకు 'షూ' భాగ్యం

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 7: వేసవిలో అత్యంత ఉష్ణోగ్రత నమోదయ్యే ప్రాంతాల్లో 9వ స్థానం పొందిన గుల్బర్గా జిల్లాలో సూర్యుడి ప్రతాపానికి ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ఇక జంతువులు పరిస్థితి చెప్పనలవి కాదు. చెప్పులు ధరిస్తున్న మనుషులే రోడ్డుపైకి రాలేని స్థితిలో ఇక జంతులు మాటేమిటి? ఇళ్లవద్ద పెంచుకునే పెంపుడు జంతువుల పరిస్థితి మాట ఎలా ఉన్నా.. పోలీసు శాఖలో నేరస్తులను పట్టుకోవడంలో ఉపయోగపడే శ్వానదళానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శ్వానదళంలో ఉండే జాగిలాలకు వేడితాపాన్ని తట్టుకునేందుకు ప్రత్యేక ఎయిర్ కూలర్లు ఏర్పాటుతోపాటు వాటి కాళ్లకు ప్రత్యేక షూలు తయారు చేయించి బయటకు వదులుతున్నారు. శరీరానికి చల్లదనం ఇచ్చే విధంగా కొబ్బరి బోండాల నీరు, రాగిమాల్ట్ లాంటివి ఆహారంగా ఇస్తున్నారు. బహుశా రాష్ట్రంలో మొదటి సారిగా కుక్కలకు ప్రత్యేక షూ తయారు చేయించి తొడిగించడం గుల్బర్గా జిల్లా ప్రత్యేకమని చెప్పుకోవచ్చు.



ప్రత్యేక షూతో ఫోజులిస్తున్న శునకం

హోసూరు జోన్

పోలింగ్ అధికారులకు శిక్షణ



శిక్షణా శిబిరంలో పాల్గొన్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి), ఏప్రిల్ 7: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరు గురించి తెలిపేలా ఆదివారం అధికారులకు శిక్షణ ఇచ్చారు. కృష్ణగిరి జిల్లా డెంకణీకోట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, శూలగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోనూ పోలింగ్ స్టేషన్ ముఖ్య అధికారులు, పోలింగ్ స్టేషన్ లెవెల్-1 స్థాయికి రెండవ దశ శిక్షణను నిర్వహిస్తారు. కలెక్టర్ కేఎం సరయు శిబిరాన్ని స్వయంగా పరిశీలించారు. ఈనెల 19న పోలింగ్ జరగనుంది. పోలింగ్ స్టేషన్‌లకు చెందిన లెవెల్-1, లెవెల్ -2 అధికారులకు తర్ఫీదు ఇచ్చారు. బర్గూరు లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1,421 మంది అధికారులు, కృష్ణగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో 1,514మంది, వేపనహళ్లి శాసనసభ నియోజకవర్గ పరిధిలో 1,526 మందికి శిక్షణ ఇస్తున్నారు. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఇతర హోదాల వారు పాల్గొన్నారు.

రేపు ఉగాది వేడుకలు

హోసూరు, ఏప్రిల్ 7: హోసూరు నగరంలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈనెల 9న క్రోధి నామసంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు పంచాంగ శ్రవణాన్ని మనోహర్ ప్రారంభించనున్నారు. అనంతరం అగరం వసంత్ కవితల సంకలనాన్ని ఆవిష్కరించనున్నారు. స్థానికులచే కవి సమ్మేళనం జరగనుంది. ప్రముఖులకు సన్మానం అనంతరం సభికులకు ప్రసాదం పంపిణీ ఉంటుందని అధ్యక్షులు, కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

వందశాతం ఓటింగ్ లక్ష్యం

హోసూరు(కృష్ణగిరి), ఏప్రిల్ 7: వందశాతం ఓటింగ్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కలెక్టర్ సరయు తెలిపారు. జిల్లా రిటర్నింగ్ అధికారి హోదాలో ఆదివారం ప్రత్యేక జాతా నిర్వహించారు. కృష్ణగిరి జిల్లా స్పోర్ట్స్ హాల్‌లో జాతాకు పచ్చజెండా ఊపారు. నియోజకవర్గంలో 8,14,076 మంది పురుషులు, 8,08,798 మంది మహిళా ఓటర్లు, 305 మంది ఇతర ఓటర్లతో కలిపి మొత్తం 16,23,179 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఓటు ఆవశ్యకతపై కరపత్రాల పంపిణీ చేశారు. రంగవల్లులు వేసి, పూలతో అలంకరించి అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండినవారు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కుపై పలు చోట్ల ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు.



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న బసవరాజ్ పాటిల్ ఇటగి

రాయచూరు, ఏప్రిల్ 7: పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు బసవరాజ్ పాటీల్ ఇటగి కోరారు. డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన ఆయన ఆదివారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయనపార్టీ అధ్యక్ష స్థానం ముళ్ళ కిరీటమన్న సంగతి తనకు తెలుసని అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండడం కూడా సహజమేనన్న విషయం తెలుసన్నారు. అదే సమయంలో పార్టీ ఐక్యతతో పని చేయడం ద్వారా అభ్యర్థిని గెలుపించుకోవడం ప్రతిఒక్కరు తమ కర్తవ్యంగా భావించాలన్నారు. లోకసభ ఎన్నికల అనంతరం జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో నిబద్ధులైన ప్రతిఒక్కరికి అవకాశం లభిస్తుందన్నారు. దీంతో పాటు జిల్లా నుంచి నామినేటెడ్ పదవులకు పెద్ద సంఖ్యలో అవకాశం లభించేలా తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. కాగా లోకసభ అభ్యర్థి జీ కుమార్ నాయక్ గెలుపు కోసం పార్టీ శ్రేణులందరు నిబద్ధతతో పని చేయాలని కోరారు.

నరేంద్ర మోదీ గ్యారెంటీలకు అండగా నిలవాలి: రాజా అమరేశ్వర్ నాయక్




రాజా అమరేశ్వర్ నాయక్

రాయచూరు, ఏప్రిల్ 7: ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా పాలన సాగించిన ప్రధాని నరేంద్ర మోదీ శాశ్వత గ్యారెంటీలకు ప్రజలు అండగా నిలవాలని సిట్టింగ్ ఎంపీ, బీజేపీ లోకసభ అభ్యర్థి రాజా అమరేశ్వర్ నాయక్ కోరారు. పార్టీ అభ్యర్థిగా నియమితులైన అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న ఆయన ఆదివారం రాయచూరు తాలూకాలోని మటమారి గ్రామంలో మిత్రపక్షం జేడీఎస్, బీజేపీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయక్, గడచిన 10 ఏళ్లల్లో నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు మరో సారి అండగా నిలవాలన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో ఎంపీగా ఐదేళ్ల పాటు సేవలందించిన తాను నియోజకవర్గంలో రైల్వేల అభివృద్ధి, హైవేల నిర్మాణం వంటి శాశ్వత అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టానన్నారు. మరోసారి తనను ఆశీర్వదించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

పండిట్ కుమార గంధర్వ (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత కుమార గంధర్వ 1924 ఏప్రిల్ 8న బెళగావి జిల్లా సుళేభావిలో జన్మించారు. అసలు పేరు శివ పుత్ర సిద్ధరామయ్య కొంకళి మఠ్. హిందూస్తానీ గాయ కుడిగా రాణించారు. ఐదవ యేటనే దావణగెరెలో తొలి కచేరీ ప్రదర్శించిన ఘనత. ఆరవ ఏట గుల్బర్గా జిల్లా గురుకల్మఠకు చెందిన శాంతవీర మహాస్వామిజీ ఇతను 'కుమార గంధర్వ' అంటూ అభివర్ణించగా అదే పేరుతోనే కొనసాగారు. నిర్గుణి భజనలు, జానపదాలు పాడడంలో ప్రత్యేకత సాధించారు. పాతరాగాలకు వన్నె తేవడంతో కొత్త రాగాలు సృష్టించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన జానపదాలకు గుర్తింపు తెచ్చారు. 'పద్మభూషణ్', కాళిదాస సమ్మాన్, కేంద్ర సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 1992 జనవరి 12న తుదిశ్వాస వీడారు.

కోఫీ అన్నన్ (జయంతి)



ఐక్యరాజ్యసమితి మాజీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన కోఫీ అట్టా అన్నన్ 1938 ఏప్రిల్ 8న ఘనా దేశంలోని కుమాసిలో జన్మించారు. యూఎన్‌ఓకు ఏడవ ప్రధాన కార్యదర్శిగా వ్యవ హరించారు. ఆఫ్రికా ఖండం నుంచి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తొలి నల్ల జాతీయుడు. రెండుసార్లు ఎన్నికై 1997 జనవరి 1 నుంచి పదేళ్లపాటు ఆ పదవిలో కొనసాగారు. ఐక్య రాజ్య సమితిలో పలు సంస్కరణలు తెచ్చారు. 2001లో నోబెల్ శాంతి పురస్కారం అందుకున్నారు. ఇందిరా గాంధీ శాంతి బహుమతి, బ్రిటీష్ రాణి నుంచి నైట్ హుడ్ బిరుదు అందుకున్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు కృషి చేశారు. నెల్సన్‌మండేలా స్థాపించిన ఎల్డెర్స్ సంస్థకు ఛైర్మన్‌గా వ్యవహరించారు. 2018 ఆగస్టు 18న కన్నుమూశారు.

బంకించంద్ర ఛటర్జీ (వర్ధంతి)



బంకించంద్ర చటర్జీ (ఛటోపాధ్యాయ) 1838 జూన్ 27న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నైహతిలో జన్మించారు. నవలా రచయిత, కవి, పాత్రికేయుడు. బెంగాల్ సాహిత్యాభివృద్ధికి పాటుపడిన వ్యక్తిగా సుప రిచితులు. జాతీయగీతం 'వందే మాతరం' పాటను సంస్కృతంలో ఆయనే రచించి భరతమాత కీర్తిని రెపరెపలాడేలా చేశారు. తన రచనలతో స్వాతంత్రోద్యమకారులలో స్ఫూర్తి కలిగించారు. 14 నవలలు రాశారు. బెంగాల్ సాహిత్యంలో 'సాహిత్య సామ్రాట్'గా పేరొందారు. 'రాయ్ బహదూర్' బిరుదు పొందారు. 1894 ఏప్రిల్ 8న కన్నుమూశారు.

అల్లు అర్జున్ (పుట్టినరోజు)



అల్లు అర్జున్ 1983 ఏప్రిల్ 8న మద్రాస్‌లో జన్మించారు. అలనాటి నటుడు అల్లు రామ లింగయ్య మనుమడు, మెగా స్టార్ చిరంజీవి మేనల్లుడు. నిర్మాత అల్లు అరవింద్ కుమా రుడిగానే కాక తన అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో నటుడిగా రాణించారు. 2020 విడుదలైన 'అల వైకుంఠపురములో...' అత్యధిక కలెక్షన్ సినిమాలలో ఒకటిగా నిలిచింది. 6 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్, 3 నంది అవార్డులు అందుకున్నారు. 2021లో విడుదలైన 'పుష్ప' సినిమా ఒక క్రేజ్‌గా నిలిచింది. ప్రో కబడ్డీ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గాను, పలు రకాల ఉత్పత్తులు, సంస్థలకు రాయబారిగా వ్యవహరిస్తున్నారు.

నిత్యమీనన్ (పుట్టినరోజు)



నిత్యమీనన్ 1990 ఏప్రిల్ 8న బెంగళూరులో జన్మించారు. మళయాళీ కుటుంబానికి చెందిన ఆమె నటిగా, గాయనిగా రాణించా రు. మళయాళం, తెలుగు, తమిళ, కన్నడ భాషలో 50కు పైగా సినిమాలలో నటిం చారు. తెలుగులో మూడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, రెండు నంది అవార్డులు అందుకున్నారు. ఉత్తమనటిగా పలు మార్లు నామినేట్ అయి స్పెషల్ జ్యూరీ, ఇతర అవార్డులు అందుకున్నారు.

కొనుగోలు దారులతో కిటకిటలాడిన వారపుసంత - స్తంభించిన ట్రాఫిక్



వారపుసంతలో కిటకిటలాడిన ప్రజలు

పెనుకొండ, ఏప్రిల్ 7 : తెలుగు సంవత్సరాది ఉగాది పండగ ను పురస్కరించుకుని ఆదివారం పెనుకొండలో జరిగిన వారపుసంత కొనుగోలు దారులతో కిటకిటలాడింది. పండగకు అవసరమైన కొత్తబట్టలు, నిత్యవసర వస్తువులు, ఇతర సామగ్రి కొనుగోలుకు పెనుకొండతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. దీనికారణంగా పట్టణంలోని దుకాణా లన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఊరువాకిలి అంజనేయస్వామి ఆల యం నుంచి తెలుగుతల్లి సర్కిల్, దర్గాసర్కిల్‌లోని దుకాణాలతో పాటు వారపుసంత కారణంగా వీధులన్నా కొనుగోలుదారులతో కిటకిటాలాడాయి. ఈ రద్దీతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అటుగా వచ్చిన అంబులెన్స్ వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకుని వెళ్లడానికి వీలులేక రోగులు ఇబ్బం దులకు గురయ్యారు. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి కనీసం ఒక్క హోమ్‌గార్డ్ కూడా లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

తొలి విడత ప్రచారానికి మరోసారి ప్రధాని మోదీ

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలి విడత ఎన్నికల ప్రచారానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి రానున్నారు. ఈనెల 26న 14 నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. బెంగళూరు ఉత్తర లోక్‌సభ పరిధిలోని బ్యాటరాయనపుర, హెబ్బాళ్ ప్రాంతంలో భారీ రోడ్‌షో నిర్వహించదలిచారు. చిక్కబళ్లాపుర నియోజకవర్గం దేవనహళ్ళిలో బహిరంగసభ నిర్వహించదలిచారు. మార్చి 16, 18 తేదీలలో ప్రధాని మోదీ శివమొగ్గ, కలబురగి నియోజకవర్గాలలో ప్రచారం చేశారు. మరో వారం రోజుల్లో ప్రధాని పర్యటన ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించిన రోడ్‌మ్యాప్ సిద్ధమవుతోంది. ఈలోగా పార్టీలో అసమ్మతిని సంపూర్ణంగా నియంత్రించాలని పార్టీ వర్గాలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల ప్రచార దృష్ట్యా బీజేపీ రాష్ట్రంలో 8 క్లస్టర్‌లను చేసింది. చిక్కబళ్ళాపురలో మధ్యాహ్నం 3గంటలకు బహిరంగ సభ నిర్వహించి సాయంత్రం బెంగళూరు ఉత్తర పరిధిలో రోడ్‌షో నిర్వహించదలిచారు. అదేరోజున తుమకూరులోనూ రోడ్‌షోకు ఏర్పాట్లు సాగుతున్నాయి. తొలి విడత ఈనెల 26న జరిగే పోలింగ్‌కు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. 14 నియోజకవర్గాలకు గాను 492 నామినేషన్లు దాఖలు కాగా 74 తిరస్కరించబడ్డాయి. 412 నామినేషన్లను అధికారికంగా గుర్తించారు. ఉపసంహరణకు మరో రెండు రోజులు గడువు ఉండడంతో ఎవరు నామినేషన్లు వెనక్కి తీసుకుంటారనేది కుతూహలం అవుతోంది. రెండో విడత మే 7న జరిగి పోలింగ్‌కు సంబంధించి ఏప్రిల్ 12న షెడ్యూల్ ప్రకటించనున్నారు. అదే రోజున నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. 19వరకు నామినేషన్లు, 22వరకు ఉపసంహరణ వరకు కొనసాగనున్నాయి. తొలి విడతతోపాటు మలి విడత ప్రచారానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరు కానున్నారు.

ప్రధాని మోదీ ఫొటోతో ఎన్నికలకు ...

▸▸ హైకోర్టులో ఈశ్వరప్ప కేవియట్

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫోటోతో ఎన్నికలకు వెళ్లేలా అవకాశం కల్పించాలని హైకోర్టులో శివమొగ్గ నుంచి బీజేపీ రెబెల్‌గా మారిని ఇండిపెండెంట్ అభ్యర్థి కాదలచుకున్న కేఎస్ ఈశ్వరప్ప కేవియట్ వేశారు. జాతీయ భక్తుల కూటమి పేరిట శివమొగ్గ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేయదలిచారు. ఇందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రచార వేదిక, ఫ్లెక్సీ, బ్యానరులలో ప్రధాని నరేంద్రమోదీ ఫోటోను వేసుకుంటున్నారు. ఈ విషయం బీజేపీ నేతలకు ఇబ్బందికరంగా మారింది. శివమొగ్గ బీజేపీ అభ్యర్థి రాఘవేంద్ర బహిరంగంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. అందుకు ధీటుగానే ఈశ్వరప్ప స్పందించారు. ప్రధాని నరేంద్రమోదీ ఎవరబ్బ సొత్తు కాదని, దేశప్రధాని అంటూ మండిపడ్డారు. ఎన్నికల్లో ఈశ్వరప్ప, ప్రధాని నరేంద్రమోదీ ఫోటోలను వేసుకోకుండా నియంత్రించేందుకు బీజేపీ శివమొగ్గ ముఖ్యులు ప్రయత్నాలు జరుపుతున్న తరుణంలోనే ఈశ్వరప్ప ముందుగా కేవియెట్ దాఖలు చేశారు. ఆదివారం శివమొగ్గలో ఈశ్వరప్ప మాట్లాడుతూ స్థానికంగా కొందరు ప్రధాని మోదీ ఫోటో వేసోకుండా, నాపై ఆంక్షలకు ప్రయత్నిస్తున్నారన్నారు. ముందస్తు సమాచారంతోనే కోర్టులో కేవియెట్ వేశానన్నారు. ప్రధాని మోదీ ప్రజలందరి ఆస్తి అన్నారు. అయితే బీజేపీ శివమొగ్గ జిల్లా అధ్యక్షుడు పీటీ మేఘరాజ్ మాట్లాడుతూ కేవియట్ విషయం తెలిసిందన్నారు. బీజేపీ మినహా మిగిలినవారెవ్వరూ నరేంద్ర మోదీ ఫోటోను వాడుకోరాదన్నారు. కోర్టును ఆశ్రయిస్తామని, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. కాగా శివమొగ్గలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ ఈశ్వరప్పతో కలసి పనిచేయాలని తాము భావిస్తున్నారు. ఇప్పటికైనా పంతం వీడి పార్టీలో కలసి పనిచేయాలని విన్నవించారు. సమస్యలుంటే అధిష్ఠానం పెద్దలతో చర్చించుకోవచ్చునన్నారు.

బీజేపీని ఓడించండి : సీపీఐ పిలుపు

జాలహళ్ళి, ఏప్రిల్ 7: నిత్యావసరాల ధరల నియంత్రణలో విఫలమైన బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ పిలుపునిచ్చింది. వయ్యాలికావల్‌లోని శ్రీకృష్ణదేవరాయ కళా మందిరంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన సమావేశంలో 'బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించండి' అనే నినాదంతో ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్ర సీపీఐ కార్యదర్శి కామ్రేడ్ సాతి సుందరేశ్ మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో మధ్య తరగతి ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు, గ్యాస్ సబ్సిడీ హామీ అమలు కాలేదన్నారు. కోట్లాదిమందికి కనీస ఇల్లు లేదన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రు మాట్లాడుతూ కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ గారడీ బడ్జెట్ చేశారని, రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లు విడుదల చేయలేదన్నారు. 2019లో సైనికుల మృతికి ఇంతవరకు విచారణ జరగలేదన్నారు. వీటిని ప్రశ్నించిన కేజ్రీవాల్‌ను తప్పుడు ఆరోపణలతో జైలుపాలు చేశారన్నారు. డాక్టర్ సిద్ధనగౌడ పాటిల్ మాట్లాడుతూ ప్రజలశ్రమతో నిర్మించిన జాతీయ సంపదలైన సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఉమేశ్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



వేదికపై సీపీఐ నాయకులు

ఎన్నికల అధికారులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న పీఓ, ఏపీఓలు

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ ఆఫీసర్‌లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌లకు అవసరమై శిక్షణను ఇస్తున్నారు. హెబ్బాళ్ పరిధిలోని కాడుగొండనహళ్ళిలోగల డాక్టర్ అంబేద్కర్ మెడికల్ కాలేజ్‌లోనూ, శివాజి నగర్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోనూ, యలహంకలోని శేషాద్రిపురం కాలేజీలోనూ తర్ఫీదు ఇస్తున్నారు. బెంగళూరు నగర ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ ఆదివారం తర్ఫీదు కేంద్రాలను పరిశీలించారు. ఇక్కడ మాస్టర్ ట్రైనర్‌లు ఇస్తున్న పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రంలో పీఓలు, ఏపీఓలు ఎలా వ్యవహరించాలి అనే అంశాలను ట్రైనర్‌లు వివరించారు. ఓటింగ్ మిషన్, వీవీప్యాట్‌ల పనితీరు గురించి తెలియచేశారు. ఈ సందర్భంగా మాక్‌పోల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయక ఎన్నికల అధికారి కమలాబాయి, ప్రమోద్‌పాటిల్, ఓటరు నమోదు అధికారి వీణా, తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్

లంబాణీలకు కాంగ్రెస్‌లో అన్యాయం

▸▸ సీఎం, డీసీఎం ముందే ఆగ్రహం

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): లంబాణీల మద్దతు కోరేందుకు వెళ్తే తిప్పి కొడతారని ఎంతకాలం అన్యాయాన్ని సహిస్తారని ఆ సామాజికవర్గ నాయకులు సీఎం, డీసీఎంల ముందే ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అంతర్గత ఎన్నికల సభ శనివారం జరిగింది. మే7న రెండో విడత జరిగే పోలింగ్‌కు సంబంధించి 14 లోక్‌సభ స్థానాల ముఖ్యనాయకుల సభకు సీఎం, సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ ముఖ్యులుగా పాల్గొన్నారు. 1972 నుంచి లంబాణి (సుగాలి) వర్గాలకు కాంగ్రెస్ వర్గంలో అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. ఏ ముఖంతో తాండాలకు వెళ్లి ఓట్లు అడగాలని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. అంతరంగిక సభలో కలసి పనిచేయాలని, తక్కువమంది ఉండే సామాజికవర్గాలు, కులాలను నిర్లక్ష్యం చేయరాదని సీఎం ప్రస్తావించినప్పుడు ఎమ్మెల్యే ప్రకాశ్ రాథోడ్ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి లాంబాణీలు నిరంతరంగా మద్దతు ఇస్తున్నారని, అయితే ఎక్కడ న్యాయం జరిగిందని సామాజిక వర్గంవారు ప్రశ్నిస్తున్నారన్నారు. ఇదే తొలిసారి లోక్‌సభ ఎన్నికల్లో లంబాణీలకు టికెట్ ఇవ్వలేదని రాథోడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో మాజీ మంత్రి పరమేశ్వరనాయక్, మనోహర్ ఐనాపురతోపాటు మరో ఇద్దరు ముగ్గురు సమాజానికి అన్యాయం జరిగిందని, తాము నాయకులుగా ఎలా చెప్పుకోవాలని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. డీకే శివకుమార్ వెంటనే జోక్యం చేసుకుని ఇది తగిన వేదిక కాదని, ఎన్నికలు ముగిశాక సమగ్రంగా చర్చిద్దామని సర్దిచెప్పారు. అయితే సీఎం సిద్దరామయ్య మాత్రం భీమానాయక్‌కు కేఎంఎఫ్ అధ్యక్ష పదవి, రుద్రప్ప లమాణికి డిప్యూటీ స్పీకర్ వంటి ఉన్నత పదవుల అంశాన్ని ప్రస్తావించారు. ఎంపీ టిక్కెట్ ఇవ్వలేదని మరోసారి చర్చకు లేవనెత్తడంతో సీఎం, డీసీఎంలు సర్దుబాటు చేసినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో గుల్బర్గా, బీదర్, బాగల్కోటె, రాయచూరు, చిత్రదుర్గ, దావణగెరె, శివమొగ్గ, తుమకూరు, బళ్ళారి, కొప్పళ జిల్లాలతోపాటు ఉత్తర కర్ణాటక ప్రాంతంలో లంబాణి సామాజిక వర్గ ప్రజలు పెద్దసంఖ్యలో ఉన్నారు. మొత్తమ్మీద ఎన్నికల వేళ తలెత్తిన అసంతృప్తిని చల్లార్చడంలో పార్టీ నాయకులు సఫలీకృతులయ్యారు.

పండుగలు శాంతియుతంగా ఆచరించాలి

శిడ్లఘట్ట, ఏప్రిల్ 7: ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం శాంతిసభను నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పలువురు హిందూ, ముస్లిం ప్రముఖులు సలహా సూచనలు చేశారన్నారు. భిన్నాభిప్రాయాలు లేక పోవడం సంతోషకర అంశమన్నారు. పండుగలను శాంతియుతంగా ఆచరించాలని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వరాదని సూచించారు. ఇతరుల మనోభావాలను భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయరాదన్నారు. సమావేశంలో జామియా మసీదు అధ్యక్షుడు మాట్లాడుతూ పండుగ నేపథ్యంలో రాత్రి 12వరకు దుకాణాలకు అవకాశం కల్పించాలని పోలీసులను కోరారు. నగరసభ సభ్యుడు రాఘవేంద్ర మాట్లాడుతూ భిన్నాభిప్రాయాలు లేకుండా పండుగలు చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో జేడీఎస్ నాయకులు నంద కిశోర్, మేలూరు మంజునాథ్, ముఖ్బుద్ తదితరులు పాల్గొన్నారు.



శాంతిసభలో సీఐ శ్రీనివాస్ తదితరులు

రూ.2.74 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

బంగారపేట, ఏప్రిల్ 7: తాలూకాలోని బలమండె గ్రామంలో రెండు ఇళ్ల చోరీ కేసులను కామసముద్ర పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2.74 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఫిబ్రవరి 9న బలమండె గ్రామంలోని సయ్యద్ నవాజ్ ఇంట్లో చోరీ జరిగింది. మార్చి 20న సాకమ్మ ఇంట్లోనూ బంగారం, వెండి ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. ఈ రెండు కేసులకు సంబంధించి దర్యాప్తును సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టీటీ కృష్ణ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక ఎంఐ టీవీ, ల్యాప్‌టాప్, గ్యాస్ సిలిండర్, నగలు, రూ.1.55 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి తరలించారన్నారు. సీఐ పాలాక్ష ప్రభు, కే మంజునాథ, సిబ్బంది కార్యాచరణలో పాల్గొన్నారు. కేసును ఛేదించిన పోలీసులను ఉన్నతాధికారులు ప్రశంసించారు.



స్వాధీనం చేసుకున్న సొత్తుతో పోలీసులు

పాతాళానికి గంగ

పెట్టుబడి కూడా రాని పరిస్థితి బోరుమంటున్న అన్నదాత

బొమ్మనహాళ్, ఏప్రిల్ 7: తీవ్ర వర్షాభావం, మండు వేసవితో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. బోరుబావుల్లో నీటి మట్టాలు తగ్గిపోయాయి. దీనికి తోడు వ్యవసాయ విద్యుత్ సరపరా సమయాన్ని కుదించడంతో మండల రైతులు ఆందోళన చెందుతున్నా రు. ఈ ఏడాది రబీలో బోరుబావుల కింద రైతులు వెయ్యి ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. అయితే వానలు రాకపోవడంతో బోరుబావు ల్లో నీటిమట్టం వేగంగా తగ్గిపోతోంది. ఫలితంగా వరిపంటలకు నీరందక ఎండిపోతున్నాయి. నీరు అందక పొలాలు నెర్రలు చీలు తున్నాయి. మండలంలోని శ్రీధరఘట్ట, గోనేహాళ్, కృష్ణాపురం, ఎల్‌బీనగర్ తదితర గ్రామాలలో వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలాలు తగ్గుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిమట్టం తగ్గి బోర్లలో సన్నటి ధారలా నీళ్ల వస్తున్నాయని, రోజంతా నీళ్ల పెట్టినా పొలం తడవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అలాగే శ్రీధరఘట్ట చెరువు కింద దాదాపు 200 ఎకరాలలో వరినాట్లు వేశారు. పంటలు చేతికొచ్చే సమయంలో చెరువులో నీరు ఇంకిపోవడంతో పంటలకు నీటి తడులు ఎలా ఇవ్వాలంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేల రూపాయలు పెట్టుడులు పెట్టి సాగుచేసిన పంటలు నీరందక నిలువునా ఎండిపోతే అప్పులు కుప్ప అవుతాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గోనేహాళ్ దగ్గర నీళ్లు లేక నెర్రలు విడిచిన పొలం

రెండెకరాలు ఎండిపోయింది

నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. రెండు వ్యవసాయ బోరు బావులు ఉన్నాయి. నాలుగు ఎకరాల్లో వరినాట్లు వేశా. కొన్ని రోజులుగా రెండు బోరుబావుల్లో నీటిమట్టం తగ్గిపోయింది. రెండెకరాల వరి పంట ఎండిపోయింది. ఇంకా కొంతమంది రైతుల బోర్లలో నీటిమట్టం తగ్గి వరిపంటలు ఎండిపోతున్నాయి. పెట్టుబడి అయినా వస్తుందో రాదోనని ఆందోళనగా ఉంది.

- ఈశ్వరప్ప, రైతు, శ్రీధరఘట్ట

పెట్టుబడి కూడా రాని పరిస్థితి

భూగర్భజలాలు ఇంకిపోతున్నాయి. దీనికి తోడు విద్యుత్‌కోతలు ఉన్నాయి. వరిపంట ఎండిపోతోంది. పెట్టిన పెట్టుబడులు సైతం వస్తాయో రావోనని ఆందోళన కలుగుతోంది. నాలుగు ఎకరాలలో వరి పంట సాగుచేశా. ఎకరాకుపైగా నీరు అందక ఎండిపోతోంది. వరిపంటకు నీరు సరిపోక పొలంలో నెర్రలు వచ్చాయి. మా పొలం చుట్టు పక్కల మరికొంతమంది రైతుల పంటలు ఇలాగే ఉన్నాయి. ఎకరాకు రూ. 25 వేలు చొప్పున పెట్టుబడులు పెట్టాం. పంట కోసం చేసిన అప్పులు తీరుతాయన్న నమ్మకం పోయింది.

- రవి, యువరైతు, శ్రీధరఘట్ట

టీఆర్ మిల్లులో అగ్నిప్రమాదం

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చామరాజపేటలోని టీఆర్ మిల్స్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు మిల్లు ప్రాంగణంలోని మూడు గోడౌన్‌లలో మంటలు చెలరేగాయి. టైర్లు, పైప్‌లు, ప్లైవుడ్‌నిల్వ చేసిన గోడౌన్‌కు ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ జరిగి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైరింజన్‌లు చేరుకుని మంటలను నియంత్రించే కార్యాచరణ సాగింది. అయితే ప్రాణనష్టం లేకపోవడంతో ఊరటనిచ్చింది. భారీగా నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. ప్రమాదంపై చామరాజపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నాణ్యతలో రాజీ పడకండి

బెంగళూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నాణ్యతలో రాజీ పడరాదని వినియోగదారులు కోరుకునే ఆధునిక డిజైన్లలో అందుబాటులో ఉంచాలని హరికృష్ణ గ్రూప్ కిస్నా డైమండ్ అండ్ జ్యువెల్స్ సీఎండీ ఘనశ్యామ్ ఢోలాకియా అభిప్రాయపడ్డారు. నగరంలో రిటైలర్స్‌తో ప్రత్యేక సమావేశం జరిపారు. కిస్నా షాప్ ఇన్ షాప్ బ్రాండ్ గురించి వివరించారు. 2005లో ఆభరణ బ్రాండ్లను ఆరంభించామని, 3వేలకుపైగా రిటైలర్స్‌తో సంబంధాలు కలిగి ఉన్నామని 31 ప్రత్యేక అవుట్‌లెట్‌లు ఉన్నాయన్నారు. డైరెక్టర్ పరాగ్ షా మాట్లాడుతూ బెంగళూరులో క్రియాశీలక వ్యాపారం చేస్తున్నామన్నారు. రిటైలర్‌ల ద్వారా ఎక్కువమంది వినియోగదారులకు ఆభరణాలకు విక్రయించడమే లక్ష్యమన్నారు.

మూడో రోజు కొనసాగిన ఐటీ దాడులు

పెరంబూర్, ఏప్రిల్ 7: రాష్ట్రవ్యాప్తంగా ఆదాయపు పన్ను శాఖ అధికారులు చేపట్టిన తనిఖీలు మూడో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. ఈనెల 19న లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టేలా నగదు, బహుమతుల పంపిణీని అడ్డుకొనేలా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వాహన తనిఖీలు చేపట్టి పలు కోట్ల నగదు, బహుమతులు, మద్యం స్వాధీనం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, ఓటర్లకు పంచేందుకు నగదు సిద్ధం చేశారనే సమాచారంతో ఐటీ అధికారులు ఈనెల 5వ తేది చెన్నై, తిరునల్వేలి, తేని, తిరుపత్తూర్ తదితర ప్రాంతాల్లోని 44 చోట్ల సోదాలు చేపట్టారు. నగరంలోని రెండు ప్రాంతాలు సహా మరికొన్ని చోట్ల మూడో రోజు కూడా తనిఖీలు కొనసాగాయి. అడయార్ ఇందిరా నగర్ 25వ క్రాస్ వీధిలో ఉన్న ప్రభుత్వ కాంట్రాక్టర్ రామచంద్రన్, అభిరామపురం 9వ వీధిలో ఉన్న మెట్రోవాటర్ బోర్డు మాజీ ప్రధాన ఇంజనీర్ తంగవేలు తదితరుల ఇళ్లలో ఆదివారం తనిఖీలు కొనసాగాయి. రామచంద్రన్ పదేళ్లుగా పార్క్, వీధి దీపాల పర్యవేక్షక కాంట్రాక్ట్ చేపడుతున్నారు. అలాగే, మాజీ ప్రధాన ఇంజనీర్ తంగవేలు ప్రస్తుతం ప్రముఖ రాజకీయ నాయకుడికి సహాయకుడిగా పనిచేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా, లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లకు నగదు పంచేందుకు రాజకీయ పార్టీలు సిద్ధపడున్నాయి అన్న సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా ఐటీ అధికారులు తనిఖీలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

నయినార్ నాగేంద్రన్ బంధువు ఇంట్లో రూ.3.72 లక్షల స్వాధీనం

వేళచ్చేరి : తిరునల్వేలి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ బంధువు గుణశేఖరన్ ఇంట్లో లెక్కల్లో చూపని రూ.3.72 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. వాషర్‌మెన్‌పేటలో ఉన్న లక్ష్మి గాయత్రి హోటల్ యజమాని గుణశేఖర్ ఇంట్లో ఫ్లయింగ్ స్క్వాడ్, ఆదాయపు పన్ను శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి నగదు స్వాధీనం చేసుకున్నారు.

రూ.4 కోట్ల నగదు తిరిగి ఇచ్చేస్తారు - టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై

అడయార్: తాంబరం రైల్వే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న రూ.4 కోట్లను తిరిగి సంబంధిత వ్యక్తులకు ఇచ్చేస్తారని, ఈ డబ్బుతో సంబంధం ఉన్న వారిపై ఎలాంటి కేసు నమోదు చేయరని టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై అన్నారు. తిరునెల్వేలిలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్‌కు చెందిన హోటల్ నుంచి రూ.4 కోట్లను చెన్నై నుంచి తిరునెల్వేలికి తరలించేందుకు సన్నాహాలు చేశారన్నారు. అయితే, ఈ డబ్బును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్నప్పటికీ ఆ డబ్బును తిరిగి ఇచ్చేస్తారని, వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయరన్నారు. అదే బీజేపీ రాజకీయమన్నారు. కేవలం అణగారిని వర్గాలు, పేద ప్రజలపైనే బీజేపీ కేసులు నమోదు చేయిస్తుందన్నారు. నెల్లైకు వచ్చే తమ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హెలికాప్టర్ దిగేందుకు వీలుగా జాన్స్ స్కూల్ మైదానంలో హెలీప్యాడ్‌ను నిర్మించామన్నారు. అక్కడ నుంచి ఆయన కారులో బెల్ స్కూల్ గ్రౌండ్‌కు చేరుకుంటారని, ఈ సందర్భంగా ఆయన రోడ్ షోకు అవకాశం ఉందన్నారు.

ఘనంగా హింగులాజ్ మాత జయంతి

పామిడి, ఏప్రిల్ 7: పట్టణంలోని రంగ సుభే ఫిర్కా భగవాన్‌దాస్ విఠోబా స్వామి దేవాలయంలో హింగులాజ్ మాత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కృష్ణయ్య, రంగసుభే ఫిర్కా సమాజ్ అధ్యక్షులు టీటీ నాగభూషణం, ఉత్తర్కర్ మంజునాథరావు, మహిళా మండలి సభ్యులు, అర్చకులు సూర్యనారాయణస్వామి, తేజస్వామి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జూదం ఆడుతూ పట్టుబడిన వైసీపీ యువనాయకుడు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 7: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివారులో జూదం ఆడుతూ మండల వైసీపీకి చెందిన మండల యూత్ నాయకుడు విశ్వనాథ్‌రెడ్డితో పాటు మరికొంతమంది అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామ శివారులో ఆదివారం జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించి విశ్వనాథ్‌రెడ్డి, కెంచప్ప, పెద్దన్న, రవిలతోపాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 10,630 నగదును, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు వివరించారు.